హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు



# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 09 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8





## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సీఎం రేవంత్ రెడ్డి
- మీడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 08:** క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు.

మిగతా 3లో..

## నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

- సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే
- రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం
- ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్టు 08:** హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండి పడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు.

మిగతా 3లో..

## సాగునీటి ప్రాజెక్టులకు 5వేల కోట్లు మంజూరు



- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 08:** సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్అర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పను లు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మా ట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయ డానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్ప ష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ

మిగతా 3లో..

## నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

### పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 08:** :హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మి నార్, ఫలక్‌నుమా

మిగతా 3లో..

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 08:** మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయం లో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావి స్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వా లని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం-2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహి ళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ

మిగతా 3లో..

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

- 15 ఆగస్టున ప్రారంభించనున్న సీఎం




**నిజామాబాద్,ఆగస్ట్8 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్డ్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్డ్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది.

## డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

- సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ
- ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్



**చెన్నై,ఆగస్టు8 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీల తో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరిం చడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీ యాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం

## 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు



- కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

మిగతా 4లో..

## గూఢచర్యం కేసులో పోలీసుల అదుపుతో వింగ్ కమాండర్

- హనీట్రాప్ లోబర్చుకున్న పాక్ మహిళ
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

**న్యూఢిల్లీ, ఆగస్టు 08:** పాక్ కోసం గూఢచర్యానికి పాల్పడ్డ భారత ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్‌ను ఢిల్లీ పోలీ సులు అరెస్టు చేసిన విషయం ఆలస్య ంగా వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం మే నెలలో నే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదంతం వెనుక భారీ గూఢచర్య నెట్‌వర్క్ ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ నిఘా ఆఫీసర్లు పన్నిన హనీట్రాప్‌లో వింగ్ కమాండర్ పడ్డాడని చెప్పాయి. నిందితుడిపై అప్పటికే కొంతకాలంగా నిఘా పెట్టి ఆపై పోలీసులకు సమా చారం అందించామని ఎయిర్‌ఫోర్స్ ప్రతినిధి తెలిపారు. వ్యక్తిగత జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న వింగ్ కమాండర్ హనీట్రాప్‌లో పడ్డట్టు పోలీసులు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో పరిచ యమైన ఒక మహిళ అతడి పరిస్థితిని ఆసరాగా చేసుకుని గుఢచర్యానికి ఉసి గొల్పింది. 'చాటింగ్‌తో వాళ్ల పరిచయం మొదలైంది. ఆ తరువాత వీడియో కాల్స్ చేసుకున్నారు. అతడికి నమ్మకం కలిగించాక ఆమె మిలిటరీ కదలికల సమాచారం, ఫొటోలను కోరిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మహిళ కోరిక మేరకు కీలకమైన సమాచారం, డాక్యుమెంట్స్‌ను వింగ్ కమాండర్ డిజిటల్ మాధ్యమాల ద్వారా షేర్ చేశా డు. ఆ తరువాత ఆమె సూచనలతో అతడు తన సహోద్యోగి ఫోన్‌లో స్పైవేర్ కూడా ఇన్‌స్టాల్ చేశాడు. రిమోట్‌గా డివైజ్‌లోని సమాచారాన్ని తస్కరించేందుకు, లోకేషన్ డేటాను తెలుసుకునేందుకు, ఫోన్ కాల్స్‌ను వినేలా స్పైవేర్‌ను డిజైన్ చేశారు.

## ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

- సాగర్ నీళ్లు తాగడానికే సరిపోవు
- రైతులు ఆరుతడి పంటలనే వేయాలి
- సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి




**నల్గొండఆగస్టు8 :** ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం కూడా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటికే బోర్లలో కూడా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటికే సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ కూడా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు.కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎంఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వె÷-లలెంల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్-ఎల్‌బీసీ కోసం ఎంతైనా

మిగతా 3లో..

## నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్



మిగతా 3లో..

# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు



- హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు
- వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట

హైదరాబాద్, ఆగస్టు 08: నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ తీవ్ర గందరగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# మరింత విషమంగా మెడికో ప్రియాంక ఆరోగ్యం



## వెంటిలేటర్‌పై కొనసాగుతున్న చికిత్స

హైదరాబాద్, ఆగస్టు 08: రాజమండ్రి మెడికో విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్యామాల్‌లో స్కూటీపై వెళ్తున్న మెడికోలు డాక్టర్ ప్రియాంక, దుర్గవెంకట సాయిలను మద్యం సేవించిన కొందరు యువకులు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ నేపథ్యంలో ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లడంతో బ్రెయిన్ డెడ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని హుటాహుటిన రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. గడిచిన ఆరో రోజులుగా ప్రియాంక మృత్యువుతో పోరాడుతోంది. మెడికో ప్రియాంక చికిత్సలో చివరి ప్రయత్నంగా నేడు అప్నియా పరీక్ష చేయనున్నారు. కోమాలో ఉన్న ప్రియాంక మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయిందా.. లేదా అని నిర్ధారించడానికి డాక్టర్లు కీలకమైన పరీక్ష చేయనున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందా.. లేదా అనేది అప్నియా పరీక్షతో తెలుసుకోనున్నారు. అప్నియా పరీక్ష అనంతరం చివరి రిజల్ట్‌ను విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. అంతేకాకుండా, ప్రియాంక ఆర్గాన్ డొనేషన్ చేసే విషయంపై తల్లిదండ్రులకు ఇప్పటికే పలు మార్లు కిమ్స్ వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. మెడికో చనిపోయిందని నిర్ధారిస్తే ఆర్గాన్స్ డొనేట్ చేసి ఇతరుల ప్రాణాలు కాపాడాలనే ఆలోచనలో ప్రియాంక కుటుంబం ఉన్నట్లు తెలుస్తోంది.

# జిల్లాలో సాగునీటి ప్రణాళిక విడుదల చేయాలి

- రైతులకు నీటి వినియోగంపై అవగాహన కల్పించాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్



ఖమ్మం,ఆగస్టు8 : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగు నీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన అవగాహన కల్పించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, రైతులు ముందస్తుగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్ష పాతంలో హెచ్చుతగ్గుల నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగు నీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియో గించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని కోరారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఎంత మేరకు నీటి నిల్వలు ఉన్నాయి, ఎప్పు డు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతాలకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీ క్షించి అధికారికంగా ప్రకటించాలని కోరారు. నీటి విడుదలకు సంబంధించి ముందస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

- పూర్తిస్థాయి జలమట్టానికి చేరువలో నీటిమట్టం



శ్రీశైలం,ఆగస్ట్8 : ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది. ఈ క్రమంలో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతున్నా సాగర్‌కు విడుదల కావడం లేదు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రాజెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడుతున్నారు. ఇదిలావుంటే తుంగభద్ర జలాశయా నికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు 42,114 క్యూసెక్కుల ఇన్ ఎలో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగునీటి విడుదలపై ఈనెల 11 తేదీన కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర

- సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర సాగుతుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా తెలిపారు. శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించి మార్పు తీసుకువచ్చేందుకు కలిసిక ట్టుగా యాత్రలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాం గ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రజలను దోచుకునే పాలన మారాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత, విద్యార్థులు చేపట్టిన ఉద్యమమే ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు. మండలంలో ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలాన్ని ముంపు నుంచి శాశ్వతంగా రక్షించేందుకు ఎత్తైన ప్రదేశాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి గిరిజన ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని, పోడు రైతులపై అటవీశాఖ అధికారులు నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించి రక్షణ కల్పించాలన్నారు. ఈ యాత్రలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేలిష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎపి కోసం తెలంగాణ నీళ్ల త్యాగం

## సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్



హైదరాబాద్, ఆగస్టు 08: కర్నాటక, తదితర రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జూ రాలకు భారీగా వరద వస్తో ందని, వచ్చిన నీళ్లను వచ్చి నట్లే తెలంగాణ ప్రభుత్వం మొ త్తం ఏపీకి వదిలేస్తుందని బీఆర్ ఎస్మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, బీరం హర్ష మాట్లాడారు. ఏపీ ప్రభుత్వంతో తెలంగాణలోని రేవంత్ ప్రభుత్వం చీకటి ఒప్పందం చేసుకుని, తెలంగాణకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీ టూర్లపై ఉన్న దృష్టి పాలమూరు రైతులపై లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వర్షాలతో వరద ప్రారంభమైన వెంటనే మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లల్లో నీళ్లను నింపి, రైతులకు సమయానికి నీళ్లను అందించేదని స్పష్టం చేశారు. జూరాలకు వరద వచ్చి పదిహేను రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు రిజర్వాయర్లలో నీళ్లను నింపే ప్రయత్నం కూడా చేయలేదని దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ పనిచేస్తున్నది తెలంగాణ రైతుల కోసమా? పక్క రాష్ట్ర రైతుల ప్రయోజనం కోసమా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరినో సంతృప్తి పరచడానికే రేవంత్ రెడ్డి తెలంగాణ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్

## పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ



వరంగల్,ఆగస్టు8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరఫున రెండు కోట్ల 25 లక్షల రూపాయలలను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మర ణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమ్మతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరుమీదబ్యాంకులోజమచేయాలనికేసీఆర్ నిర్ణయిం చారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుం బానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబసంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూఅండగానిలుస్తుందని కేసీఆర్ తెలిపారు.

# ఔటర్ వద్ద పిల్లర్‌ను ఢీకొన్న కారు

## ఇద్దరు టైల్స్ కార్మికుల దుర్మరణం

హైదరాబాద్, ఆగస్టు 08: నగరంలో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గచ్చిబౌలి సమీపంలోని నియోపోలీస్ బ్రిడ్జ్ పిల్లర్‌ను టవేరా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు రాజస్థాన్‌కు చెందిన కన్హైయాలాల్ (25), దేరామ్ (24)గా గుర్తించామని తెలిపారు. వీరిద్దరు టైల్స్ కార్మికులుగా పని చేస్తున్నారని చెప్పారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్‌రామ్‌గూడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

# చనిపోయిన ఏడాది తరవాత అస్తిపంజరం గుర్తింపు

## ఒంటరి మహిళ మృతిని గుర్తించని బంధువుల

బెంగళూరు,ఆగస్ట్8 : ఓ డూప్లెక్స్ ఇంట్లో మహిళ అస్థిపంజరం వెలుగుచూసిన సంఘటన కర్ణాటకలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరులోని బాగలగుంటే ఏరియాకు చెందిన 52 ఏళ్ల దాక్షాయణి హవనూర్ లేఅవుట్‌లోని డూప్లెక్స్ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె భర్త ఉమేష్ 10 సంవత్సరాల క్రితం యాక్సిడెంట్‌లో చనిపోయాడు. కుమారుడు క్యాన్సర్‌తో ప్రాణాలు కోల్పోయాడు. దాక్షాయణికి ఓకూతురు ఉంది. ఆమెకు చాలా కాలం క్రితమే పెళ్లైంది. ఒంటరిగా ఉంటున్న దాక్షాయణి సంవ త్సరం క్రితం చనిపోయింది. ఈ ఏడాది కాలంలో కూతురు, అల్లుడు ఆ ఇంటికి రాకపోవటంతో దాక్షాయణి చనిపోయిన సంగతి బయ టపడ లేదు.సమాచారం అందుకున్న బాగలగుంటే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆస్థిపంజరాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ మరణానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునే పనిలోపడ్డారు.అన్నికోణాల్లోకేసును దర్యాప్తు చేస్తున్నారు.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

## ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం

నైనిటాల్,ఆగస్ట్8: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# కన్నకూతురుపైనే కామాంధుడి లైంగిక దాడి

## కూతరు ఫిర్యాదుతో పోలీసుల అరెస్ట్

హైదరాబాద్,ఆగస్ట్8: కన్న తండ్రి క్రూర మృగంలా మారాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వాడే పశువులా మారిపోయాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అమానీవయ ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు(45) తన భార్య ముగ్గురు కూతుళ్లతో కలిసి సనత్‌నగర్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యా బిడ్డలతో గొడవలు పెట్టుకునేవాడని సమాచారం. కాగా, మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి తన రెండో కూతురిపై కన్నేసి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వరుసగా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబం పరువు పోతుందని విషయం బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కానీ తండ్రి అరాచకాలు ఆగకపోవడంతో, ఓపిక నశించిన బాలిక సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో బాలికతండ్రిపైపోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

బలగం BALAGAM TV

balagamtv100@gmail.com

## (మొదటిపేజీ తరువాయి)

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

కరెంటు ఉండి కూడా వ్యవసాయదారులకి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజు కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్తున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరోక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పడలెక్కే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో మరోసారి నీళ్ల దోపిడీ తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలతో ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు వత్తి పోసుకుంటుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముఖు క్లటెత్తే పాడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులకు 5వేల కోట్లు మంజూరు

కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్ల÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదనిస్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ది చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

## ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగునీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పిస్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని,

## నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

# టీచర్లపై బురదజల్లే చర్యలు సహించడం

- మెగా డిఎస్సీని .. దగా డిఎస్సీ అంటే ఎలా
- అసలు డిఎస్సీ అంటే ర్జతం తెలియని వరే విమర్శలు
- కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదిస్తే నిందలేస్తారా
- కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద డిఎస్సీ టీచర్ల ధర్నా

కర్నూలు,ఆగస్ట్8 : వైకాపా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోరుతూ మెగా డీఎస్సీ 2025 ఉపాధ్యాయులు కదం తొక్కారు. కడప, అనంతపురం నుంచి భారీగా చేరుకున్న టీచర్లు కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి జెడ్పీ కార్యాలయం వరకు ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుల నియామకాలపై కుట్రలు చేయొద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వాస్తవాలు వివరించినా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. కుట్రలు చేసిన వారికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.మెగా డీఎస్సీపై వైకాపా కుట్రలను తిప్పికొట్టేందుకే శనివారం చలో కర్నూలు కార్యక్రమాన్ని చేపట్టామని ఉపాధ్యాయులు తెలిపారు. 2025 మెగా డీఎస్సీలో తాము కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే ఓర్చుకోలేని వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మం డిపడారు. దగా డీఎస్సీ అంటే టీచర్లందరూ వైసీపీపైన యుద్ధం చేస్తారని వార్నింగ్ ఇచ్చారు. మెగా డీఎస్సీ నిర్వహించిన మంత్రి నారా లోకేశ్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. డీఎస్సీ అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే డీఎస్సీ అని తెలిపారు. టీచర్లపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్తామంటూ ఉపాధ్యాయులు హెచ్చరించారు. వైకాపా ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ ప్రకటన లేక ఎంతోమంది నిరుద్యోగులు ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదటి సంతకంతో 16 వేలకు పైగా డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. వైకాపా తప్పుడు ప్రచారం మానుకోవాలని హెచ్చరించారు. జిల్లాలోని కొండారెడ్డి బురుజు నుంచి మెగా డీఎస్సీ 2025 ఆత్మ గౌరవ ర్యాలీ ప్రారంభమైంది. ఉపాధ్యాయుల హక్కు - న్యాయమైన నియామకాలకు మద్దతు అంటూ ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. మెగా డీఎస్సీ నియామకాలపై జరుగుతోన్న తప్పుడు ప్రచారం, నిరాధార ఆరోపణలను ఖండిద్దాం అంటూ ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వందలాది నూతన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగనుంది.

కర్నూలు నడిబొడ్డున కొండారెడ్డి బురుజు వద్ద 'థ్యాంక్యూ సీఎం సార్... థ్యాం క్యూ మినిస్టర్ నారా లోకేశ్' అంటూ టీచర్స్ నినాదాలు చేశారు. కొండారెడ్డి బురుజుపైకి ఎక్కిన ఉపాధ్యాయులు.. వైసీపీకి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. 'కష్టపడి చదివి ఉద్యోగాలు పొందాం... ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు. మాపై వైసీపీ దుష్ప్రచారం చేయడం తగదు' అంటూ ఉపా ధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ అంటే మీనింగ్ తెలియని వాళ్లు తమపై ఆరోపణలు చేస్తున్నారని ఉపాధ్యాయులు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వని వారు నేడు విమర్శించడం సిగ్గు చేటన్నారు. డీఎస్సీ పరీక్షలు రాయని వారు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## మహిళా ఎస్ఐ పట్ల అసభ్య ప్రవర్తన

### వైకాపా నేత చింతాడ రవికోసం గాలింపు



శ్రీకాకుళం,ఆగస్ట్8 : జిల్లాలోని ఆమదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రవి కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు గాలిస్తున్నారు. మహిళా ఎస్ఐపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో రవికుమార్ పరారీలో ఉన్నారు. ఇటీవల వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆముదాలవలస వైసీపీ ఇన్‌ఛార్జి చింతాడ రవి.. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించారంటూ ఓ వీడియో బయటకు వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి వైసీపీ నేత సహా 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రవి ఏ1గా ఉన్నారు. జగన్ పర్యటన అనంతరం గత పది రోజులుగా అరెస్ట్ భయంతో వైసీపీ నేతతోపాటు అనుచరులంతా అజ్ఞాతంలోకి వెళ్లారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. రవిని అరెస్ట్ చేసేందుకు విస్తృతంగా గాలిస్తున్నారు. నిన్నటి నుంచి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వైసీపీ నేత ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 21 మందిలో నిన్న రాత్రి ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేశారనే ఉద్దేశంతో రవితో పాటు 21 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో వైసీపీ నేతను ఏ క్షణంలో అయినా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## బాబాయి మృతిని తట్టుకోలేక అబ్బాయి ఆత్మహత్య

ఒంగోలు,ఆగస్ట్8 : ప్రకాశం జిల్లా కంభంలో తీవ్ర విషాదం ఘటన చోటుచేసుకుంది. బాబాయి మృతి చెందడాన్ని తట్టుకోలేక ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. బాబాయి మణికుమార్ మృతి చెందిన విషయం తెలుసుకున్న క్లైమ్ బాబు అనే యువకుడు.. తీవ్ర మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ బాధలోనే కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. ఒకే కుటుంబంలో వరుసగా ఇద్దరు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మణికుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయనను గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ మణికుమార్ మృతి చెందారు. బాబాయి మృతి వార్త క్లైమ్ బాబును తీవ్రంగా కలిచివేసినట్లు తెలుస్తోంది. బాబాయితో ఉన్న అనుబంధం కారణంగా ఆయన మృతిని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన బాబు.. కంభం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మణికుమార్, లక్రైమ్ బాబు మృతదేహాలకు కుటుంబ సభ్యులు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇద్దరి అంత్యక్రియలు ఒకేసారి జరగడం చూసి స్థానికులు సైతం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన కంభం ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## వాచ్‌మెన్ దారుణ హత్య

### ఇంట్లోకి దూరి గొంతు కోసిన దుండగులు

చిత్తూరు,ఆగస్ట్8 : చిత్తూరు రూరల్ మండలం మంగాపురం వద్ద దారుణ హత్య కలకలం రేపింది. ఎన్ఆర్ఐ పట్టాభి నాయుడు ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఆనందరావు (50)ను గుర్తుతెలియని దుండగులు కత్తితో గొంతు కోసి హత్య చేశారు. ఇంటి అద్దాలను నాటుబాంబుతో పగలగొట్టి లోపలికి చొరబడిన దుండగులు.. వాచ్‌మెన్‌పై దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిత్తూరు డీఎస్పీ వెంకటనారాయణ ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అసలు దుండగులు ఇంట్లోకి ఎందుకు చొరబడ్డారన్నది దర్యాప్తు చేస్తున్నారు. వాచ్‌మెన్ ఆనందరావును ఎందుకు హత్య చేయడం దొంగతనం కోసమే వచ్చారా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలను నిగ్గు తేల్చేందుకు ఆధారాలను సేకరిస్తున్నారు. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు.

## సీతారామ నీళ్లను నిర్వాసితులకే అందించాలి

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితులకే మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జునసాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసి తులైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువుకూ సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగునీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభు త్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎరువుల సబ్సిడీ రూపంలో లక్షల కోట్లు భరిస్తూ ఒక్కో బస్తాపై సుమారు రూ.2,000 వరకు వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అయితే, కనీసం బస్తాకు అయ్యే రూ.20 నుండి రూ.30 రవాణా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవడం శోచనీయమని, ఆ రవాణా ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు బుక్యా రమేష్, నాయకులు సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

## సల్మాన్ ఇంటివద్ద సెక్యూరిటీ కానిస్టేబుల్ మృతి

### అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసుల వెల్లడి

ముంబై,ఆగస్ట్8 : బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద విషాదం చోటుచేసుకుంది. ఇంటి వద్ద భద్రత కల్పిస్తున్న ఓ పోలీస్ కానిస్టేబుల్ అనూహ్యంగా ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యం కారణంగా డ్యూటీలో ఉండగానే ఆయన చనిపోయారు. శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ముంబై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ కారణంగా సల్మాన్ ఖాన్ ప్రాణాలకు ముప్పు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు భద్రత కల్పిస్తోంది. 2024లో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ముంబై, బాంద్రాలోని సల్మాన్ ఇళ్లు గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ వద్ద కాల్పులు జరిపారు.ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్ద కూడా భద్రత ఏర్పాటైంది. సల్మాన్ ఇంటి వద్ద డ్యూటీలో ఉన్న 41 ఏళ్ల గణెష్ అనే కానిస్టేబుల్ శనివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గేటు ముందు ఒక్కసారిగా కుప్పకూలిపో యారు. తోటి పోలీసులు ఆయనను హుటాహుటిన దగ్గరిలోని ఆస్పత్రికి తరలించారు.గణెష్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన చనిపోయినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గణెిష్ గుండెపోటు కారణంగాప్రాణాలు కోల్పోయినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

## ప్రభుత్వ రంగ సంస్థల నిర్వీర్యం

### కార్పోరేట్‌కు దాసోహమంటున్న మోడీ

### సిపిఐ ప్రచారజాతాలో చాడ విమర్శలు



కరీంనగర్,ఆగస్టు8 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ పెట్టుబడుదారులను ప్రోత్సహిస్తూ సామాన్య ప్రజలను పెనుబారం మోపుతుందని సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ప్రచార జాతలో భాగంగా చిగురుమామిడి మం డలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, సుందరగిరి గ్రామాల్లో ప్రచార జాతలో జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్తో కలిసి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించి దేశ అభివృద్ధి ఉపాధి అవకాశాలు, ప్రజా సంక్షేమం సుపరిపాలన అందిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఏ ఒక్కటి అ మలు చేయడం లేదని అన్నారు. నిత్యాసరాల పెంపు, పెట్రోలు డీజిల్ వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్యాలకు భారంగా మారిందన్నారు. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తే దేశ వ్యాప్తంగా ఆందోళన నిర్వహించి కేంద్ర ప్రభుత్వం విధానాలను ఎండగడతామన్నారు. రైతులకు కనీసం మద్దతు ధర చట్టం తెస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. పండించిన పంటలకు కనీసం మద్దతు చట్టబద్ధత కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, ధరల పెంపులను నియంత్రిం చాలని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల చట్టాలను పరిరక్షించుకోవాలని స్వ యంగా సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ సమాన పనికి సమాన వేత నం కార్మికులకు అందించడంలో కేంద్ర విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరు ద్ధరించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మారిన తిరుపతి-కరీంనగర్ బైవీక్లీ టైమ్

### తిరుపతిలో 15 నిముషాలు ముందుకు జరిగిన సమయం

కరీంనగర్,ఆగస్ట్8 : ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి- కరీంనగర్ బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 12761) బయలుదేరే సమయాన్ని దక్షిణ మధ్య రైల్వే అధికారులు సవరించారు. ప్రస్తుతం ప్రతీ బుధ, శనివారాల్లో తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి రాత్రి 8:05 గంటలకు బయలుదేరుతున్న ఈ రైలు, అక్టోబరు 10 నుంచి రాత్రి 7:50 గంటలకు బయలుదేరనుంది. అంటే ప్రస్తుతం ఉన్న సమయంతో పోలిస్తే 15 నిమి షాల ముందుగా ప్రారంభమవుతుంది. గూడూరు, విజయవాడ, వరంగల్, పెద్దపల్లి మార్గం మీదుగా కరీంనగర్‌కు చేరే ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరే సమయ మార్పునకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి, తమ ప్రయాణ ప్రణాళికలను అందుకు అనుగుణంగా మార్చుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

# సంపాదకీయం

# ప్రజాస్వామ్యానికి పట్టిన చీడను వదిలించాలి !

ప్రజాస్వామ్యంలో పాలకులు నియంతులుగా మారుతుంటే ప్రెజర్ గ్రూప్ ఉండాల్సిందే. ప్రతిపక్షాల మాట కూడా వినకుండా పాలన చేయడం అలవాటు చేసుకున్నారు. తాము అన్నకున్న విధానంలో పాలన సాగుతోంది తప్ప, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా సాగడం లేదు. ఇటీవల పరీక్ష పేపర్ల లీకేజీ పాలకులు నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. ఈ క్రమంలో బొద్దింకల దండు ఢిల్లీపై దండయాత్ర చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, పేపర్ లెస్ పరీక్షల కోసం నందన్ నీలుకని నేతృత్వంలో కమిటీ వేయడం వంటివన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదంతా కేవలం విద్యార్థుల ఒత్తిడి మూలంగానే జరిగిందని చెప్పాలి. ఈ ఒత్తిడిని కొనసాగించాలని, దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టిగా నిలబడడానికి తోడ్పడుతంది. అయితే ఈ పోరాటంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా బొద్దింకల పార్టీదే. ఇకపోతు ఈ ఒత్తిడి కొనసాగించేలా దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' .. అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తు న్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని దీప్కే తెలిపారు. నిజంగా ఈ ఆలోచనను స్వాగతించాల్సిందే. ప్రతి ఒక్కరూ ఈ నినాదం వెనక నిలబడాలి. ఎందుకంటే పాలకులు గతి తప్పకుండా ఉండాలంటే ఏదో ఒకచోట చెక్ పడాల్సి ఉంది. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ చేసిన ఈ కీలక ప్రకటన ప్రజలను ఆలోచింపచేసేదిగా ఉంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించినందున ప్రజలు కూడా ఈ ఉద్యమాన్ని సొంతం చేసుకోవాలి. మద్దతుగా నిలవాలి.. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం సిజెపి చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని దీప్కే తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. అంటే ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని కూడా దీప్కే స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరిం చనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూడా పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతేనే ఉంటాయి. కాబట్టి పోరాటం చేయాలన్న దీప్కే సంకల్పం అభినందనీయం. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పాలకపక్షాలు కప్పదాటు ప్రకటనలు చేస్తున్నాయి. దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. దేశంలో నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోంది. వపిసరీతమైన ఫీజుల దోపిడీ సాగుతోంది. అయినా పాలకులు దృష్టి సారించడం లేదు. ఈ రంగంపై పోరాడాలన్న సంకల్పం మంచిదే. ఈ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది. అన్నింటికి మించి జెన్-జీ యువత చేస్తున్న ఉద్యమాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్వాగతించడం విశేషం. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమై నవేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ నిర్మొహమాటంగా చెప్పారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ యువత ఆలోచనలను స్వాగతిస్తున్నారు. పాలకులు కూడా కళ్లు తెరిస్తే మంచిది.

# రూ.వేల కోట్ల జరిమానా

- మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్..



న్యూఢిల్లీ, ఆగస్టు 08 : సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురు దెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమ యంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టి ఒదని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యస నపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# హిందూజా సోదరులకు ఊరట

- బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం
- 40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర



న్యూఢిల్లీ, ఆగస్టు 08 : దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపర మైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మా సనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరిం చింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్దీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది. అప్పీల్ దాఖలులో 4,522 రోజుల ఆలస్యం జరిగిందని పేర్కొంటూ దానిని స్వీకరించలేదు. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# జలధార - జలహారతి ఇక నిరంతర కార్యక్రమం

- ఎల్‌నినోతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- సాగు,తాగునీటితో పాటు, పరిశ్రమలకు నీటి సరఫరా
- పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిందే
- అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి,ఆగస్టు8 : జలధార - జలహారతి ఇక నిరంతర కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. జలధార - జలహారతిపై సీఎం శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గినా పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నీటి పొదుపు, వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది సాధారణం కంటే 39 శాతం తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ నుంచి డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 867 మిల్లిమీటర్లుగా ఉందని వెల్లడించారు. కాగా.. ప్రస్తుతం 525 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టులో 56 శాతం లోటు వర్షపాతం ఉండే అవకాశం ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఏపీలోని వివిధ బేసిన్లలో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తాగునీటి నిల్వలు, సరఫరాపై పక్కా ప్రణాళిక రూపొందించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. వెలు గోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లలో తాగునీటిని నిల్వ చేయాలని సూచించారు.నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాలకు తాగునీటి కేటాయింపులు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఆయా ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించి రిజర్వాయర్లు నింపాలని మార్గనిర్దేశర చేశారు. తాగునీటి వసతి లేని ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగులో ఉన్న పంటలను కాపాడాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యం మేరకు వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను భవిష్యత్తులో ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావంతో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు మేత, నీటి లభ్యతను ముందుగానే నిర్ధారించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశుసంపద రక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ నిరంతరం కొనసాగాలని సీఎం తెలిపారు. చాలాకాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీరు అందించాలని సూచించారు. అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. జలధార - జలహారతి కింద 82,865 పనులు గుర్తించామని.. 79,826 పనులు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. జలధార - జలహారతి కింద రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే భవిష్యత్తు నీటి సమస్యలను సమర్థంగా ఎదుర్కొవచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

- కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు
- విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు




బెంగళూరు,ఆగస్టు8 : 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు.ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు. బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు. గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు.'సర్లా ఏవియేషన్' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.





# ఎగువ మానేరు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బలగం టీవీ,గంభీరావుపేట

ఎగువ మానేరు పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గంభీరావుపేట తహశీల్దార్ మారుతి రెడ్డి శనివారం ఓ ప్రకటన లో తెలిపారు . ఈ సందర్భంగా తహశీల్దార్ మారుతి రెడ్డి మాట్లాడుతూ ఎగువ మానేరు ప్రాజెక్టు మత్తడి మీదుగా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు వాగుల వైపు వెళ్లకూడదని,వాగు పరిసరాల్లో పశువులను మేతకు తీసుకెళ్లడం, వాగు అవతలి గట్టుకు తీసుకెళ్లి కట్టివేయడం చేయరాదని సూచించారు. అలాగే మేకలు, గొర్రెల కాపరులు కూడా వాగుల వైపు మేత కోసం వెళ్లకూడదని స్పష్టం చేశారు.భారీ వర్షాల సమయంలో వాగుల్లో ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

# ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య..

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న బోయినిపల్లి ఎస్సై**



బలగం టీవీ, బోయినిపల్లి:

ఆర్థిక ఇబ్బందులు భరించలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోయినిపల్లి గ్రామానికి చెందిన భోటుకు మహేష్ (34) ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం (ఆగస్టు 7) తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య నవ్య, కుమారులు లోకేష్ (6), అశ్విత్ (4) ఉన్నారు. మృతుడి తల్లి భోటుకు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయినిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# బీడీ కార్మికులు, వృద్ధుల పెన్షన్లపై కాంగ్రెస్ నిర్లక్ష్యం సిగ్గుచేటు

**-అర్హులందరికీ సకాలంలో పెన్షన్లు అందించాలి..**

**-బీజేపీ నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి**



బలగం టీవీ, ముస్తాబాద్

బీడీ కార్మికులు, వృద్ధులు, పేదల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం సిగ్గుచేటని బీజేపీ నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ సందర్భంగా కస్తూరి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు పేదలు తమ సమస్యలు చెప్పుకుంటున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.నిత్యం బీడీలు చుట్టి కుటుంబాలను పోషిస్తున్న కార్మికులకు, వయోభారంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న వృద్ధులకు పెన్షన్లు సకాలంలో అందకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. అర్హులైన లబ్ధిదారులు పెన్షన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని వెంటనే నివారించాలని డిమాండ్ చేశారు.పేదల ఓట్లతో అధికారంలోకి వచ్చి,పేదల సమస్యలను పట్టించుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీడీ కార్మికులు, వృద్ధుల పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.పేదల కన్నీళ్లతో నడిచే ప్రభుత్వం కాదు.. పేదల కోసం పనిచేసే ప్రభుత్వం కావాలి అని పేర్కొంటూ, బీజేపీ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.



# సగం వాటాతోనే సామాజిక న్యాయం

**-బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కాలి:**

**-బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన సముచిత వాటా దక్కినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ దళపతి, బీసీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రికి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల ఉద్యమ నేత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీసీ ఉద్యమకారుడు శ్రీగాధ మైసయ్య అధ్యక్షతన నిర్వహించిన బీసీ చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పరికిపండ్ల అశోక్ హాజరై మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో బీసీలకు ఇప్పటికీ సముచిత న్యాయం దక్కకపోవడం బాధాకరమని అన్నారు. అడవుల్లో పులులను లెక్కిస్తారని, రోడ్ల వెంట చెట్లను లెక్కిస్తారని, జంతువులను సైతం లెక్కించి వాటి వివరాలను నమోదు చేస్తారని, కానీ దేశంలో సగానికి పైగా ఉన్న బీసీల జనాభాను లెక్కించకపోవడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు సమగ్ర కులగణన అవసరమని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.అఖిలభారత పద్మశాలి సంఘం నేత, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన చిందం రాధాకిషన్ మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం బీసీలందరూ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.కార్యక్రమంలో బీసీల సమస్యలు, హక్కులు, రిజర్వేషన్లు తదితర అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించే 'బీసీ మ్యానిఫెస్టో' పుస్తకాలను బీసీ నాయకులతో కలిసి డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అంకారపు మహేష్, గుడ్ల విష్ణు, దూస సత్తయ్యతో పాటు వివిధ బీసీ సంఘాల నాయకులు, చేనేత, పద్మశాలి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటుదాం..

**-బిజెపి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్**

బలగం టీవీ, బోయినిపల్లి:

భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో,మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో శుక్రవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడం ద్వారా ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని, దేశభక్తిని మరింతగా పెంపొందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఆగస్టు 12న మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి పార్టీలకు అతీతంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ ఐక్యత, సమైక్యత మరియు దేశభక్తి స్ఫూర్తిని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు."జాతీయ జెండా మన గౌరవానికి ప్రతీక.. తిరంగా మన జాతీయ ఐక్యతకు ప్రతీక. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటుదాం" అని అన్నారు.* ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహాచారి, స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు కందారపు వెంకటేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జువ్వెంతుల శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు సుంకపాక ప్రభు, సీనియర్ నాయకులు స్వామి కుమార్, సారంపల్లి రాజు, రాచర్ల రాజేశం,రమేశ్, కదిరి నాగరాజు, బోగోజి గంగాధర్ చారి, అమిరిశెట్టి గంగయ్య, కొనుకటి హరీష్ ,దూస శ్రీకాంత్, వినయ్, బ్రహ్మప్రసాద్, సాయికుమార్ గుంటి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచులకు గౌరవ పెన్షన్ అమలు చేయాలి..

**ఎన్నికల హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి..**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

మాజీ సర్పంచులకు గౌరవ పెన్షన్ అమలు చేస్తామని 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు మిర్యాల్కర్ శ్రీనివాస్ కోరారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులకు గౌరవ పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చిందని,ఆ హామీపై విశ్వాసంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో మాజీ సర్పంచుల పాత్ర కూడా ఉందన్నారు.ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నప్పటికీ మాజీ సర్పంచులకు గౌరవ పెన్షన్ అందిస్తామన్న హామీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మాజీ సర్పంచుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలని కోరారు.ముఖ్యంగా మాజీ సర్పంచుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గౌరవ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం తరఫున కోరుతున్నామని తెలిపారు.



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి మాజీ సర్పంచుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, గౌరవ పెన్షన్ అమలుకు కృషి చేయాలని కోరారు.విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి నాలుక సత్యం, సంపూనూరి మల్లేశం గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గుర్రం భూపతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవుని సుజాత, నర్సయ్య, జిల్లా కోశాధికారి ఏరెల్లి నారాయణ, జిల్లా నాయకులు నాలుక సత్యం, దసరం గంగాధర్, మద్ది రాంచంద్రం, ఇస్లావత్ రాములు నాయక్‌తో పాటు సుమారు 20 మంది మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుని కుటుంబంలో వెలుగులు నింపిన రామన్న..




బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోల వారికి ఇన్సూరెన్స్ కట్టలేని పరిస్థితి ఏర్పడినందున రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో కార్మికులందరికీ మాజీ మంత్రి సిరిసిల్ల ఎమ్మెల్యే రామన్న సొంతంగా ప్రమాద బీమా కట్టడం జరిగింది. గత నాలుగు నెలల క్రితం బొప్పాపూర్ గ్రామానికి చెందిన బొమ్మనవేని రాజు ఆటో ప్రమాదంలో మరణించగా శుక్రవారం వారి కుటుంబానికి రామన్న కట్టిన ప్రమాద బీమా ఐదు లక్షలు చెక్కును బిఆర్ఎస్ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆటోలు నడవని పరిస్థితి నెలకొనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆటో కార్మికులందరికీ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఇన్సూరెన్స్ కట్టారు. రామన్న కట్టిన ఇన్సూరెన్స్ వలన ఆటో కార్మికుడి కుటుంబానికి కొండంత అండ దొరికిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు మరియు గౌరవాధ్యక్షులు బొల్లి రామ్మోహన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణ హరి, బొప్పపూర్ గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లక్ష్మణరావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, సర్పంచులు కొండ రమేష్, అందె సుభాష్, ఎలగందుల నరసింహులు, మరియు సీనియర్ నాయకుడు కుంబాల మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# గంజాయి వ్యసన నిర్మూలనే లక్ష్యం

**– బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి..**

**డీ-అడిక్షన్ సెంటర్ బాధితుల కోసం క్యారం, చెస్ బోర్డులు అందజేత..**

**వ్యసనం నుంచి బయటపడేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి**

**బాధితులకు పూర్తి సహకారం అందిస్తాం..**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే, వ్యసనానికి గురైన బాధితులను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎం.ఓ సుమన్ రావు కి డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితుల వినియోగార్థం క్యారం, చెస్ బోర్డులను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన సౌకర్యాలు కల్పించి, వారు త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గంజాయి వ్యసనానికి బానిసై ఆ అలవాటు నుంచి బయటపడాలని స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారు పోలీసు శాఖను సంప్రదించాలని ఎస్పీ కోరారు. అటువంటి వారికి అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి, డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి నిపుణుల పర్యవేక్షణలో చికిత్స అందించి, వారిని తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కుపాదం మోపడంతో పాటు, వాటి వినియోగదారులపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వ్యసనానికి గురైన వారికి అవగాహన కల్పించి, అవసరమైతే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించే కార్యక్రమాలను కూడా నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.

గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం లేదా గంజాయి వ్యసనానికి బానిసై స్వయంగా మానలేని పరిస్థితిలో ఉన్న వ్యక్తుల వివరాలు తెలిసిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ అడ్మిన్ సురేష్, వైద్యులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు..



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఆగస్టు 7 జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ఖాదీ కార్యాలయం సిరిసిల్లలో చేనేత కళాకారులను సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది.

చేనేత మన సాంస్కృతిక చారిత్రక స్వాతంత్ర్య వారసత్వమని ,పర్యావరణ హితకరమైన వృత్తి అని వేదిక కరీంనగర్ విభాగ్ సహసంయోజక్ మోర శ్రీనివాస్ తెలిపారు. 1905 ఆగస్టు 7 న భారత స్వాతంత్ర ఉద్యమంలో స్వదేశీ ఉద్యమం ప్రారంభమై స్వదేశీ వస్తువులను వాడాలని విదేశీ వస్తువులను బహిష్కరించాలనే స్ఫూర్తి తోటి ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం స్వదేశీ ఉద్యమాన్ని మరోసారి స్మరించుకోవడం మరియు చేనేత కళాకారుల నైపుణ్యాన్ని ప్రాధాన్యతను గుర్తించడం ఈ రోజు యొక్క ప్రాధాన్యతను తెలుపుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. నేడు కూడా స్వదేశీ వస్తువులను వాడడం భారత ఆర్థిక రంగానికి అత్యంత ఆవశ్యకమని దీనితోటే భారత్ రాబోయే రోజుల్లో ప్రపంచ ఆర్థిక రంగంలో మూడవ స్థానానికి ఎగబాకుతుందని తెలియజేశారు .

ఈ సందర్భంగా సమరసత వేదిక ఆధ్వర్యంలో వేదిక బాధ్యులు ఖాదీ కార్యాలయంలో ఖాదీ కార్యాలయ మేనేజర్ ఆడేపు రమేష్, చేనేత కళాకారులు వెంగళ రవీందర్, రిక్కుమల్ల కొమరయ్య మంగళారపు రాజేశం, కళ్యాడపు దేవదాస్, పచ్చునూరి లక్ష్మయ్య,చాప పద్మ, వెల్ది హరిప్రసాద్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేదిక బాధ్యులు కోడం రవి సుంకోజీ రమేష్ చారి, మాదాసు శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ నాయకులు నాగుల శ్రీనివాస్, ఆడెపు రవీందర్, గుడ్ల విష్ణు, గజ్జెల్లి సత్యనారాయణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.



# రష్యాపై ఆంక్షల బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం

### భారత్, చైనాలపై 100 శాతం టారిఫ్‌లు విధించే అవకాశం

### 86-11 ఓట్లతో నెగ్గిన ఆంక్షల ప్రతిపాదన

వాషింగ్టన్ (అంతర్జాతీయ విభాగం):

రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లు జరుపుతున్న దేశాలపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు అమెరికా కీలక అడుగు వేసింది. రష్యా ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్న ప్రధాన దేశాలపై 100 శాతం వరకు దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారాన్ని అధ్యక్షుడికి కల్పించే కీలక ఆంక్షల బిల్లుకు అమెరికా సెనేట్ భారీ మెజారిటీతో ఆమోదం తెలిపింది. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'గా పిలిచే ఈ బిల్లుకు అనుకూలంగా 86 మంది, వ్యతిరేకంగా 11 మంది సభ్యులు ఓటు వేశారు.

భారత్‌పై ప్రతికూల ప్రభావం?

ఈ ప్రతిపాదిత చట్టం ప్రకారం రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటున్న చైనా, భారత్, అజర్‌బైజాన్, హంగేరీ, స్లోవేకియా దేశాల నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై 100 శాతం వరకు ప్రతికార సుంకాలు విధించే వెసులుబాటు లభిస్తుంది. ఈ బిల్లు ఆగస్టు 31న అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) సమావేశమైన తర్వాత ఓటింగ్‌కు రానుంది. అక్కడ నెగ్గి, అధ్యక్షుడి ఆమోదముద్ర పడితే ఇది పూర్తిస్థాయి చట్టంగా మారుతుంది.

పుతిన్ సహా రష్యా ప్రముఖులపై ఆంక్షలు:

ఈ బిల్లులో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో పాటు



ఆ దేశ అగ్ర రాజకీయ నేతలు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక సంస్థలపై నేరుగా కఠిన ఆంక్షలు విధించనున్నారు. అయితే, అధ్యక్షుడికి పరిమితి లేని టారిఫ్ అధికారాలు కట్టబెట్టడం వల్ల అంతిమంగా అమెరికాలోనే నిత్యావసరాల ధరలు పెరిగి, అక్కడి వినియోగదారులపైనే భారం పడుతుందని పలువురు డెమొక్రాటిక్ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.



## 2028 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలు: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

బలగం టీవీ, హైదరాబాద్

నగరాల్లో విపరీతంగా పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేసేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను ఎగరేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. బెంగళూరులో 'సర్లా ఏవియేషన్' కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

2028 నాటికి ఆకాశంలోకి ఎయిర్ ట్యాక్సీలు:

తీవ్ర రద్దీతో ఉక్కిరిబిక్కిరవుతున్న బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (eVTOL) విమానాల అవసరం ఎంతో ఉందన్నారు. ఈ సాంకేతికత ద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచే ఈ ఎయిర్ ట్యాక్సీలకు సంబంధించిన పరీక్షల దశను మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

డీజీసీఏ కీలక అడుగు:

సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ మరియు విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ (DGCA) సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్ భద్రతా ప్రమాణాలు, నిబంధనలపై పరిశ్రమ భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నాయని మంత్రి వివరించారు. ఇందులో భాగంగా 'సర్లా ఏవియేషన్'కు డీజీసీఏ ఇప్పటికే 'డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్' మంజూరు చేసిందని, ఇది ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల అభివృద్ధిలో అతిపెద్ద మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.

# అమెరికా-ఇరాన్ చర్చలు సఫలమైతే ఇంధన ధరలు

### డొనాల్డ్ ట్రంప్

### హర్మూజ్ జలసంధి వివాదం కొలిక్కి వస్తోందని అమెరికా అధ్యక్షుడు ఆశా-భావం

### ఇరాన్ పట్ల ఆంక్షల సరళి, అణ్వాయుధ నియంత్రణపై స్పష్టత

**బలగం టీవీ, హైదరాబాద్**

హర్మూజ్ జలసంధి వివాదంపై అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వస్తున్నాయని, ఇవి సఫలమైతే అంతర్జాతీయంగా చమురు మరియు ఇంధన (గ్యాసోలిన్) ధరలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాక్స్ న్యూస్ అందించిన సమాచారం ప్రకారం, ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన ఈ సముద్ర మార్గంలో అనిశ్చితి తొలిగితే అంతర్జాతీయ వాణిజ్యం మళ్లీ యథాస్థితికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ వ్యాఖ్యలు:

ఓవల్ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్, ఈ వివాదం త్వరలోనే ముగుస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఇరాన్ ఈ ఘర్షణను ఎక్కువ కాలం కొనసాగించలేదని, అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా నిరోధించడమే అమెరికా ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. దౌత్యపరమైన చర్చల్లో తాను స్వయంగా పాల్గొంటున్నానని, త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.

హర్మూజ్ జలసంధి భద్రత & ఇరాన్ ప్రతిస్పందన:

ప్రస్తుతానికి హర్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ పర్యవేక్షణ కొనసాగుతున్నప్పటికీ, మైన్ల ముప్పు కారణంగా వాణిజ్య నౌకలు ప్రయాణించడానికి భయపడుతున్నాయని, అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అన్వేషిస్తున్నామని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్-ఒమన్ మధ్య ఈ జలసంధి పునరుద్ధరణపై జరుగుతున్న చర్చల్లో పురోగతి కనిపిస్తోందని అమెరికా అధికారులు తెలిపారు. ఒప్పందం



అమల్లోకి వస్తే ఇరాన్ ఓడరేవులపై ఉన్న దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేసే అవకాశం ఉంది. అయితే తమ సాయుధ దళాలు స్వదేశీ సాంకేతికతతో ఎలాంటి బాహ్య ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని ఇరాన్ తాత్కాలిక రక్షణ మంత్రి బ్రిగేడియర్ జనరల్ మజీద్ ఎబ్న్-ఎ-రెజా స్పష్టం చేశారు.



## 34 ఏండ్ల వ్యక్తికి అరుదైన ఆర్థోపెడిక్ సర్జరీ

34 ఏండ్ల వ్యక్తికి అరుదైన ఆర్థోపెడిక్ సర్జరీ

**బలగం టీవీ, హైదరాబాద్**

తీవ్రమైన రోడ్డు ప్రమాదంలో తలకు గాయమై, దాదాపు మూడేండ్లుగా మంచానికే పరిమితమైన 34 ఏండ్ల వ్యక్తికి అమోర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి, మళ్లీ నడిచేలా చేశారు. గత నెల 21న కుడి కాలుకు, 27న ఎడమ కాలుకు శస్త్రచికిత్సలు పూర్తి చేసిన వైద్యులు, ప్రస్తుతం సదరు రోగికి పునరావాస (రీహాబిలిటేషన్) చికిత్స అందిస్తున్నారు. మూడేండ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర తలగాయానికి గురైన ఈ రోగికి గతంలో పలు న్యూరోసర్జరీలు చేసి ప్రాణాలను కాపాడారు. అయితే, కాలక్రమేణా రెండు కాళ్లలో తీవ్ర వైకల్యం ఏర్పడి సొంతంగా నిలబడటానికి, నడవడానికి వీలులేకుండా పోయింది. క్రమంగా అతను పూర్తిగా మంచానికే పరిమితమై, నిలబడటానికి కూడా ఇతరుల సహాయం అవసరమయ్యే స్థితికి చేరుకున్నాడు. వైద్య పరీక్షల్లో రోగికి రెండు తుంటి భాగాల్లో 'న్యూరోజెనిక్ హెటెరోటోపిక్ ఆసిఫికేషన్' ఉన్నట్టు నిర్ధారణ అయింది. తీవ్రమైన మెదడు గాయం (బ్రెయిన్ ఇంజ్యూరీ) తర్వాత కండరాలు, మెత్తని కణజాలాలలో అసాధారణంగా ఎముక పెరగడం ఈ వ్యాధి లక్షణం. దీనికితోడు తుంటి, మోకాలు, మడమల వద్ద నరాలు బిగుసుకుపోవడంతో (కాంట్రాక్చర్స్) కాళ్లు పూర్తిగా బిగుసుకుపోయి కదలకుండా తయారయ్యాయి. మల్టీడిసిప్లినరీ ఆర్థోపెడిక్ బృందం సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్సను దశల వారీగా నిర్వహించింది. దీంతో మూడేండ్ల తర్వాత సదరు బాధితుడు మళ్లీ సూటిగా నిలబడి, సహాయంతో నడవగలిగే స్థితికి చేరుకున్నాడు.

ఈ శస్త్రచికిత్స విజయంపై అమోర్ హాస్పిటల్స్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కిషోర్ బి రెడ్డి, వారి బృందం మాట్లాడుతూ "తీవ్రమైన బ్రెయిన్ ఇంజ్యూరీ తర్వాత వచ్చే 'న్యూరోజెనిక్ హెటెరోటోపిక్ ఆసిఫికేషన్' అత్యంత సవాలుతో కూడుకున్న సమస్య అన్నారు. అసాధారణంగా పెరిగిన ఎముక కీళ్లను పూర్తిగా బిగదీస్తుందనీ, ఈ కేసులో అదనంగా పెరిగిన ఎముకను సురక్షితంగా తొలగిస్తూ, బిగుసుకుపోయిన కీళ్లను సరి చేయడానికి పక్కా ప్రణాళికతో కూడిన దశలవారీ శస్త్రచికిత్స అవసరమైందన్నారు.

# పీఓకేలో ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన

### శాంతియుత నిరసనకారులపై చర్యలకు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టీకరణ

### ఇంటర్నెట్ ఆంక్షలు, జేఏఏసీ (JAAC)పై నిషేధా-న్ని తప్పుబట్టిన ఐరాస

బలగం టీవీ, హైదరాబాద్

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో గత కొంతకాలంగా కొనసాగుతున్న హింసాత్మక పరిస్థితులు, ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా ప్రజలు తమ అభిప్రాయాలను, నిరసనలను శాంతియుతంగా వ్యక్తపరిచే ప్రాథమిక హక్కును ఆయా ప్రభుత్వాలు గౌరవించాలని స్పష్టం చేసింది. శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న పౌరులపై బలప్రయోగానికి దిగి హాని కలిగిస్తే, దానికి బాధ్యులైన వారిపై ఖచ్చితంగా జవాబుదారీతనం ఉండాలని హెచ్చరించింది. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ తరపున డిప్యూటీ అధికార ప్రతినిధి ఫర్హాన్ హక్ ఈ వివరాలను వెల్లడించారు.

సమగ్ర దర్యాప్తునకు డిమాండ్:

ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ చేసిన సూచనలకు సెక్రటరీ జనరల్ పూర్తి మద్దతు ప్రకటించారు. పీఓకేలో జరుగుతున్న ఆందోళనల్లో పౌరులతో పాటు భద్రతా సిబ్బంది మరణించడంపై త్వరితగతిన, నిష్పాక్షికమైన సమగ్ర దర్యాప్తు చేపట్టాలని పాకిస్థాన్ ప్రభుత్వానికి సూచించారు.

డిజిటల్ హక్కులు, ప్రజాస్వామ్య సూత్రాల ఉల్లంఘన:

నిరసనలకు నాయకత్వం వహిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)ని తీవ్రవాద నిరోధక చట్టాల కింద నిషేధించడం, ఆ సంస్థ నాయకులను అరెస్టు చేయడాన్ని ఐరాస తీవ్రంగా ఆక్షేపించింది. ప్రజలు సభలు, సమావేశాలు నిర్వహించకుండా నిరోధించడం, ప్రాంతమంతటా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడం భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని అభిప్రాయపడింది. వెంటనే ఇంటర్నెట్‌ను పునరుద్ధరించి, సమస్యలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది.

మరణాల సంఖ్యపై వివాదం & నిలిచిపోయిన ఎన్నికలు:

పీఓకేలో జూన్ మొదటి వారం నుండి ఇప్పటివరకు సుమారు 400 మంది నిరసనకారులు మృతి చెందారని, జులై 27 తొలిదశ పోలింగ్ రోజే 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని జేఏఏసీ ఆరోపిస్తుండగా, పాకిస్థాన్ ప్రభుత్వం ఈ గణాంకాలను తోసిపుచ్చింది. ప్రధాని సలహాదారు రాణా సనావుల్లా మాట్లాడుతూ మృతుల సంఖ్య రెండు అంకెలకే పరిమితమని పేర్కొన్నారు. తీవ్ర ఉద్రిక్తతల కారణంగా ఆగస్టు 10న జరగాల్సిన మూడో విడత అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాలకు గాను 7 స్థానాల్లో పోలింగ్‌ను అధికారులు నిరవధికంగా వాయిదా వేశారు.





# ఎస్సీఎస్సీకి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

బలగం టీవీ, హైదరాబాద్

ఎస్సీఎస్సీకి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సంయుక్తంగా అందించిన అసాధారణ సేవలు, వ్యాపార పునరుద్ధరణ వ్యూహాలకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. సైబరాబాద్ పోలీస్ సంక్షోభ నిర్వహణ నమూనాపై 'హార్వర్డ్ బిజినెస్ పబ్లిషింగ్'(హెచ్‌బీపీ), ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సంయుక్తంగా 'ఆపరేషనల్ ఎక్సలెన్స్ ఇన్ క్రైసిస్ - ట్రాన్స్‌ఫార్మింగ్ బిజినెస్ కంటిన్యూటీ ఇన్ సైబరాబాద్ ఐటీ కారిడార్' పేరిట ఒక ప్రత్యేక కేస్ స్టడీని ప్రచురించాయి. ఈ కేస్ స్టడీని ఐఎస్‌బి ప్రాజెక్ట్ ప్రొఫెసర్ విజయ్ సుందర్ ఎమ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ (మాజీ సైబరాబాద్ సిపి) వీ.సీ సజ్జనార్, శ్రీమతి దితి జోషిలు కలిసి రూపొందించారు. కేస్ స్టడీ ప్రచురణను పురస్కరించుకుని శనివారం సీసీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్, విర్తూసా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్సీఎస్సీ మాజీ జనరల్ సెక్రటరీ) డాక్టర్ కృష్ణ యెద్యులలు ఎస్సిఎస్సి కోవిడ్ కోర్ టీమ్ పాల్గొన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సైబరాబాద్ పోలీస్, ప్రభుత్వ శాఖలు, ఆరోగ్య సంస్థలు, పరిశ్రమలతో కలిసి రాత్రింబవళ్లు శ్రమించిన వాలంటీర్లను, సభ్యులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. కోవిడ్ సమయంలో సైబరాబాద్ పోలీస్‌కమిషనర్‌గా వీసీ సజ్జనార్ నాయకత్వంలో తీసుకున్న చర్యలు, సైబరాబాద్ పోలీసులు, ఎస్సీఎస్సీ, పరిశ్రమల భాగస్వామ్యంతో లాక్‌డౌన్ ప్రకటించిన కొన్ని రోజుల్లోనే దాదాపు 8,00,000 మంది ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగులను సురక్షితంగా 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానానికి తరలించడంపై చర్చించారు. ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, తయారీ, రిటైల్, టెలికాం రంగాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పనిచేసేలా చర్యలు తీసుకోవడంతోపాటు ఎస్సీఎస్సీ, సైబరాబాద్ పోలీస్ అందించిన అనేక సేవలతో ఒక రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. ఇలాంటి సేవలను భవిష్యత్‌లో మార్గదర్శకంగా తీసుకోవాలని సీపీ కోరారు.

# న్యూరో, రోడ్డు ప్రమాదాల్లో గోల్డెన్ అవర్ కీలకం

బలగం టీవీ, హైదరాబాద్

రోడ్డు ప్రమాదాలు, తలకు గాయాలు, వెన్నెముక దెబ్బలు వంటి న్యూరో ట్రామా కేసుల్లో ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంటలో సరైన చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ రావు అన్నారు. న్యూరోట్రామా సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, కిమ్స్ న్యూరోసర్జరీ విభాగం సహకారంతో నగరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల న్యూరోట్రామా – న్యూరోట్రామా నర్సింగ్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు.

దేశంలోని రోడ్డు ప్రమాదాలు యువతలో వికలాంగత్వానికి ప్రధాన కారణంగా మారుతున్నాయని చెప్పారు. చిన్నపిల్లల్లో ఎత్తు నుంచి పడిపోవడం వల్ల తలకు గాయాలు, యువతలో బైక్ ప్రమాదాలు, మధ్య వయస్సు వారిలో రోడ్డు ప్రమాదాలు, వృద్ధుల్లో జారి పడడం వల్ల మెదడు, వెన్నెముక గాయాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని వివరించారు.

ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజరీలు దేశంలో ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్నాయని కిమ్స్ న్యూరోసర్జరీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రాహి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ - 2023 నివేదిక ప్రకారం భారతదేశంలో టీబీఐ ప్రమాదాలు 11.1 శాతం పెరిగినట్టు వెల్లడైందన్నారు.

రోడ్డు ప్రమాదాల కారణంగా జరిగే మరణాల్లో భారతదేశం వాటా 10 శాతంగా ఉందన్నారు. భారతదేశంలో ప్రమాదాలు 4,80,652 మాత్రమే నమోదైనప్పటికీ మరణాలు 1,50,785కు చేరుకున్నాయని తెలిపారు. ప్రమాదాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ మరణాలు ఐదు రెట్లు అధికంగా ఉండటం అత్యవసర వైద్య సేవల అందుబాటు, సమయానుకూల చికిత్స లోపాన్ని సూచిస్తోందన్నారు.

రోడ్డు ప్రమాద మరణాల్లో 50 శాతానికి పైగా పాదచారులు, సైకిల్‌దారులు, మోటార్ సైకిల్ దారులేనని నిపుణులు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 66 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్కువ ఆదాయం గల కుటుంబాల్లో మరణాల రేటు రెండింతలు ఎక్కువగా ఉందని వెల్లడించారు.

సరైన హెల్మెట్ వాడితే టీబీఐ ప్రమాదాన్ని గరిష్టంగా 74 శాతం వరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం హెల్మెట్ వినియోగం కేవలం 22 నుంచి 55 శాతం మధ్యే ఉందని తెలిపారు. ట్రామా రోగుల్లో దాదాపు మూడోవంతు మంది గాయమైన 24 గంటల తర్వాతే ఆస్పత్రికి చేరుతున్నారని, ఈ ఆలస్యం ప్రాణాపాయాన్ని మరింత పెంచుతోందని హెచ్చరించారు. తల గాయం చిన్నదిగా కనిపించినా వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు.

సమాజంలో అవగాహన పెంపు, హెల్మెట్ తప్పనిసరి అమలు, గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవల బలోపేతం, ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి చేర్చే వ్యవస్థ బలపడితే టీబీఐ మరణాలు గణనీయంగా తగ్గించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ గచ్చిబౌలి కన్సల్టెంట్ న్యూరో మరియె స్పైన్ సర్జన్ డాక్టర్ రాఘవేంద్ర, కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్వేత, న్యూరోట్రామా సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సుమిత్ సిన్హా తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# తంగళ్లపల్లిలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**బలగం టీవీ,తంగళ్లపల్లి:**

తెలంగాణ వీరుడు, బందూక్ పండుగ సాయన్న జయంతి వేడుకలను తంగళ్లపల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ కుల బాంధవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మండల ముదిరాజ్ అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వం, ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాడారని కొనియాడారు. అణగారిన వర్గాల ప్రజలకు అండగా నిలిచి, అన్యాయాన్ని ఎదిరించిన ధైర్యశాలి అని అన్నారు.మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య

మాట్లాడుతూ.. రజాకార్ల అరాచక పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ప్రజల కోసం పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగల రాజు, భరత్‌నగర్ సర్పంచ్ వెంకన్న, దేశాయిపల్లె రమేష్, మల్లేశం, రంగు అంజయ్య, సారంపల్లి రాజు, రంగు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# పడిక్కల్ క్లాసిక్ సెంచరీ..

## మెరిసిన జడేజా, సుతార్
## శ్రీలంక ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్
## తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 357/8
## పూర్తిగా విఫలమైన జైస్వాల్, పంత్, జురెల్

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు జరుగుతున్న మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగాడు. గాయంతో సిరీస్‌కు దూరమైన సాయి సుదర్శన్ స్థానంలో అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్లాసిక్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. పడిక్కల్‌తో పాటు రవీంద్ర జడేజా (63), కేఎల్ రాహుల్ (40), మానవ్ సుతార్ (41), గుర్నూర్ బ్రార్ (36 నాటౌట్) రాణించడంతో శనివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్లకు 357 పరుగులు చేసింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్ స్కోరు (363) కంటే భారత్ ప్రస్తుతం 6 పరుగుల వెనుకంజలో ఉంది.




ఆరంభంలోనే షాక్.. పడిక్కల్ నాక్: భారత ఇన్నింగ్స్ ప్రారంభంలోనే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (0) ఎదుర్కొన్న రెండో బంతికే విశ్వ ఫెర్నాండో బౌలింగ్‌లో వికెట్ సమర్పించుకున్నాడు. అయితే తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో కలిసిన పడిక్కల్ రెండో వికెట్‌కు 96 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రాహుల్ నిలకడగా ఆడగా, పడిక్కల్ కవర్ డ్రైవ్‌లు, కట్ షాట్లతో అలరించాడు. రాహుల్ (40) ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాతో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 121 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకుని రిటైర్డ్ హర్ట్‌గా వెళ్లాడు.



కీపర్లు విఫలం.. నిలబెట్టిన మానవ్ సుతార్: మిడిలార్డర్‌లో వచ్చిన స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ (2), బ్యాకప్ కీపర్ ధ్రువ్ జురెల్ (1) తీవ్రంగా నిరాశపరిచారు. స్పిన్నర్ రమేష్ మెండిస్ బౌలింగ్‌లో అనవసర షాట్లకు ప్రయత్నించి వీరిద్దరూ వెంటవెంటనే నిష్క్రమించడంతో భారత్ 174 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో జడేజా, తొలి విదేశీ పర్యటనలో ఉన్న మానవ్ సుతార్ ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. జడేజా హాఫ్ సెంచరీ తర్వాత, సరాన్ష్ జైన్ (22) కూడా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగారు.

చివర్లో గుర్నూర్ బ్రార్ ధనాధన్: ఆట చివర్లో మళ్లీ బ్యాటింగ్ వచ్చిన పడిక్కల్‌తో కలిసి యువ బౌలర్ గుర్నూర్ బ్రార్ (17 బంతుల్లో 36 నాటౌట్) టీ20 శైలిలో విరుచుకుపడ్డాడు. 4 భారీ సిక్సర్లు, 2 ఫోర్లతో అలరించి రెండో రోజు ఆటకు మెరుపు ముగింపునిచ్చాడు. లంక బౌలర్లలో రమేశ్ మెండిస్, అసంక మనోజ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. మ్యాచ్ చివరి రోజైన ఆదివారం ఇరు జట్లు చెరో 45 ఓవర్లు బ్యాటింగ్ చేయనున్నాయి.

సంక్షిప్త స్కోర్లు:

శ్రీలంక ఎలెవన్ తొలి ఇన్నింగ్స్: 363/8

భారత్ తొలి ఇన్నింగ్స్: 90 ఓవర్లలో 357/8 (దేవదత్ పడిక్కల్ 142 నాటౌట్, జడేజా 63, మానవ్ సుతార్ 41, కేఎల్ రాహుల్ 40; రమేష్ మెండిస్ 2/32

# భువనేశ్వర్ కుమార్ ఎంపికపై ఆకాశ్ చోప్రా కీలక విశ్లేషణ

## వర్క్‌లోడ్ పరిమితి మేజర్ సమస్య అన్న మాజీ ఓపెనర్
## ఐపీఎల్ ఫామ్ ఆధారంగా నేరుగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు ఎంపిక తగదని వ్యాఖ్య
## అశ్విన్ సహా పలువురు విశ్లేషకుల మద్దతు



బలగం టీవీ, హైదరాబాద్

సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్య ఇవ్వనున్న 2027 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా రాణించాలంటే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయాలని మాజీ దిగ్గజ ఆర్. అశ్విన్ సహా పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ 2026 సీజన్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) విజయంలో కీలక పాత్ర పోషించి 28 వికెట్లతో మెరిసిన భువీ పవర్‌ప్లేతో పాటు డెత్ ఓవర్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నాడు.

ఈ క్రమంలో భువనేశ్వర్ కుమార్‌ను వన్డే ప్రపంచకప్‌కు ఎంపిక చేయడంపై భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా విశ్లేషించారు.

వయసు కాదు.. వర్క్‌లోడే అసలు సమస్య:

భువీకి ప్రస్తుతం 36 ఏళ్లు వచ్చినప్పటికీ వయసు అడ్డంకి కాదని వర్క్‌లోడ్ మాత్రమే ప్రధాన ప్రతికూలత అని ఆకాశ్ చోప్రా తెలిపారు. భువనేశ్వర్ కుమార్ మళ్లీ భారత జట్టుకు ఆడాలని తాను కోరుకుంటున్నప్పటికీ, గత కొంతకాలంగా అతను రంజీ ట్రోఫీ, విజయ్ హజారే వంటి దేశీయ 50 ఓవర్ల లేదా ఫస్ట్ క్లాస్ టోర్నీలు ఆడటం లేదని గుర్తుచేశారు. వన్డే క్రికెట్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి, 50 ఓవర్ల పాటు మైదానంలో ఫీల్డింగ్ చేయాల్సి ఉండటం వల్ల అత్యంత ఫిట్‌నెస్ మరియు వర్క్‌లోడ్ నిర్వహణ అవసరమవుతాయి.

ద్వైపాక్షిక సిరీస్‌ల్లో అవకాశాలివ్వాలి:

కేవలం ఐపీఎల్‌లో 4 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడనే కారణంతో నేరుగా 50 ఓవర్ల ప్రపంచకప్‌కు ఎంపిక చేయడం సరైన పద్ధతి కాదని చోప్రా అభిప్రాయపడ్డారు. 2022 నవంబర్ నుంచి భారత జట్టుకు దూరంగా ఉన్న భువీని వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో చేర్చాలనుకుంటే, ఇప్పటి నుంచే ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లలో వరుస అవకాశాలు ఇచ్చి అతని ఫిట్‌నెస్‌ను పరీక్షించాలని సూచించారు.




# టాప్-100 ర్యాంక్‌లోకి తెలంగాణ షట్లర్లు అర్జున్-అచ్యుతాదిత్య

## బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అరుదైన ఘనత
## తొమ్మిది నెలల్లోనే టాప్-100లోకి ప్రవేశం

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ డబుల్స్ షట్లర్లు అర్జున్ రెడ్డి, అచ్యుతాదిత్య రావు అంతర్జాతీయ వేదికపై అరుదైన ఘనత సాధించారు. జతకట్టిన తొమ్మిది నెలల్లోనే బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-100లోకి ప్రవేశించారు. 2025 అక్టోబర్‌లో కలిసి ఆడటం ప్రారంభించిన ఈ జోడీ ఇప్పటివరకు 12 టోర్నమెంట్లలో పాల్గొని 5 పతకాలు సాధించడంతో పాటు అంతర్జాతీయ సర్క్యూట్‌లో అత్యంత వేగంగా ఎదిగిన ద్వయంగా నిలిచింది.

గతేడాది మెక్సికో ఇంటర్నేషనల్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ ద్వయం.. మరో మూడు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచింది. ఇటీవల ముగిసిన కొరియా మాస్టర్స్ టోర్నీ తర్వాత ఈ జంట అధికారికంగా టాప్-100లో తమ స్థానాన్ని ఖరారు చేసుకుంది.

# టీమిండియాను వేధిస్తున్న గాయాలు.. సాయి సుదర్శన్ దూరం!




## శ్రీలంక సిరీస్ నుంచి వైదొలిగిన తమిళనాడు బ్యాటర్
## రేసులో తెలుగు తేజం షేక్ రషీద్

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక పర్యటనలో ఉన్న టీమిండియాను గాయాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల కీలక సిరీస్‌కు ముందే భారత జట్టుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్ గాయాల కారణంగా దూరమవ్వగా.. తాజాగా టాప్ ఆర్డర్ బ్యాటర్ సాయి సుదర్శన్ కూడా ఈ ప్రతిష్టాత్మక సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు.

కాలి బొటనవేలి గాయం తిరగబెట్టడంతో..

శ్రీలంక-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో అద్భుత శతకాలు బాదిన సాయి సుదర్శన్, ఆ మ్యాచ్‌లోనే కాలి బొటనవేలి గాయానికి గురయ్యాడు. ఫిట్‌నెస్ సాధిస్తాడనే నమ్మకంతో ప్రసిద్ధ మూడో స్థానం (No. 3) కోసం సెలెక్టర్లు అతడిని తుది జట్టు రేసులో భావించినప్పటికీ, బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (CoE)లో జరిగిన వైద్య పరీక్షల్లో గాయం పూర్తిగా తగ్గలేదని తేలింది. దీంతో అతను ఈ ద్వైపాక్షిక సిరీస్ మొత్తానికి అందుబాటులో ఉండటం లేదని స్పష్టమైంది.

రేసులో తెలుగు తేజం షేక్ రషీద్!

సాయి సుదర్శన్ దూరం కావడంతో అతని స్థానంలో భారత జట్టులోకి ఎవరిని తీసుకోవాలనే అంశంపై బీసీసీఐ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ రేసులో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన 21 ఏళ్ల యువ సంచలనం షేక్ రషీద్ ముందుంజలో ఉన్నట్లు సమాచారం.

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యంత అద్భుతమైన రికార్డు కలిగిన షేక్ రషీద్, ఇప్పటివరకు 29 మ్యాచ్‌ల్లో 46.64 సగటుతో 1,959 పరుగులు సాధించాడు. అందులో 5 శతకాలు, 10 అర్ధశతకాలు ఉన్నాయి. ఇటీవల శ్రీలంక-ఏతో జరిగిన సిరీస్‌లోనూ (63, 20, 45) అతను నిలకడగా రాణించాడు. ఫిట్‌నెస్ అసెస్‌మెంట్ కోసం బిసిసిఐ అతడిని బెంగళూరులోని CoEకి రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించినట్లు కథనాలు వస్తున్నాయి.

సర్ఫరాజ్ ఖాన్‌తో తీవ్ర పోటీ

రషీద్‌తో పాటు ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ పేరును కూడా సెలెక్టర్లు పరిశీలిస్తున్నారు. స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే అనుభవం ఉండటంతో సీనియర్ కోటాలో సర్ఫరాజ్ వైపు కూడా మొగ్గు చూపే అవకాశం ఉంది. అలాగే రుతురాజ్ గైక్వాడ్ పేరు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, ప్రస్తుత ఫామ్ మరియు శ్రీలంక పరిస్థితుల దృష్ట్యా షేక్ రషీద్ లేదా సర్ఫరాజ్‌లలో ఒకరికి స్థానం దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

తొలి టెస్టు మ్యాచ్ సమయానికి సరైన ప్రత్యామ్నాయ ఆటగాడి పేరును బీసీసీఐ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.




# వరుసగా రెండోసారి అలన్ బోర్డర్ మెడల్ గెలుచుకున్న హెడ్

## అత్యున్నత పురస్కారం సొంతం చేసుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్
## ఒక్క ఓటు తేడాతో అలెక్స్ క్యారీపై విజయం
## తొమ్మిది నెలల్లోనే టాప్-100లోకి ప్రవేశం

బలగం టీవీ, హైదరాబాద్

ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు ట్రావిస్ హెడ్‌కు ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. ఆస్ట్రేలియా అత్యున్నత క్రికెట్ పురస్కారమైన 'అలన్ బోర్డర్ మెడల్'ను అతను వరుసగా రెండో ఏడాదీ కైవసం చేసుకున్నాడు. బ్రిస్బేన్‌లో జరిగిన క్రికెట్ ఆస్ట్రేలియా అవార్డుల కార్యక్రమంలో దిగ్గజ కెప్టెన్ అలన్ బోర్డర్ చేతుల మీదుగా హెడ్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. దీనితో రికీ పాంటింగ్, మైఖేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ సరసన చేరి, వరుసగా రెండేళ్లు ఈ మెడల్ గెలుచుకున్న ఐదో ఆసీస్ క్రికెటర్‌గా నిలిచాడు.

ఒక్క ఓటు తేడాతో థ్రిల్లింగ్ విజయం:

ఈ పురస్కారం కోసం నిర్వహించిన ఓటింగ్‌లో ట్రావిస్ హెడ్ కేవలం ఒక్క ఓటు తేడాతో విజయం సాధించడం విశేషం. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ 152 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా, ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ 150 ఓట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఓటింగ్ కాలవ్యవధిలో (2025 జనవరి 29 - 2026 జనవరి 8) మూడు ఫార్మాట్లలో కలిపి 30 మ్యాచ్‌లాడిన హెడ్, 1,437 పరుగులతో ఆస్ట్రేలియా తరఫున టాప్ రన్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో మూడు సెంచరీలతో విరుచుకుపడి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

ఇతర పురస్కారాలు:

ఈ కార్యక్రమంలోనే మిచెల్ స్టార్క్ 'టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా, మిచెల్ మార్ష్ 'వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా, మరియు టిమ్ డేవిడ్ 'టీ20 ప్లేయర్ ఆఫ్ ది ఇయర్'గా అవార్డులు అందుకున్నారు. అలన్ బోర్డర్ సమక్షంలో ఈ గౌరవం దక్కడం ఎంతో సంతోషంగా ఉందని, రాబోయే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ, వన్డే ప్రపంచకప్‌లపైనే తన దృష్టి అంతా ఉందని హెడ్ వ్యాఖ్యానించాడు.



# భారత్-శ్రీలంక టెస్టు సిరీస్‌కు ఫ్రీ ఎంట్రీ: ఎస్‌ఎల్‌సీ సంచలన నిర్ణయం

**టికెట్ లేకుండానే ప్రత్యక్షంగా మ్యాచ్‌లను వీక్షించే అవకాశం**

**ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టుల సిరీస్**

**బలగం టీవీ, హైదరాబాద్**

క్రికెట్ అభిమానులకు శ్రీలంక క్రికెట్ బోర్డు (SLC) తీపి కబురు అందించింది. స్వదేశంలో భారత జట్టుతో జరగనున్న రెండు మ్యాచ్‌ల ప్రతిష్టాత్మక టెస్టు సిరీస్‌ను ఉచితంగా వీక్షించే అవకాశాన్ని కల్పించింది. ఎలాంటి టికెట్ అవసరం లేకుండానే అభిమానులు నేరుగా స్టేడియానికి వచ్చి మ్యాచ్‌లను చూడవచ్చని అధికారిక ప్రకటనలో తెలిపింది. ముఖ్యంగా యువతలో టెస్టు క్రికెట్ పట్ల ఆసక్తిని, ప్రాచుర్యాన్ని పెంపొందించడంతో పాటు స్టేడియాలకు ప్రేక్షకులను విశేషంగా రప్పించడమే లక్ష్యంగా శ్రీలంక క్రికెట్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (WTC) 2025-27 సైకిల్‌లో భాగంగా పాయింట్ల పట్టికలో 5, 6 స్థానాల్లో ఉన్న భారత్, శ్రీలంక జట్లకు ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లను కుటుంబ సమేతంగా వచ్చి వీక్షించేందుకు వీలుగా గాలే వేదికలో గేట్ నంబర్ 4, కొలంబో (SSC) మైదానంలో గేట్ నంబర్ 3, 4, 5 మరియు 7 ల ద్వారా ఉచిత ప్రవేశాన్ని కల్పించనున్నారు.

శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా, శ్రీలంక మధ్య ఆగస్టు 15 నుంచి 19 వరకు గాలే అంతర్జాతీయ స్టేడియంలో తొలి టెస్టు, ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో రెండో టెస్టు జరగనున్నాయి.



# కొరియా మాస్టర్స్ ఫైనల్లో అష్మిత చాలిహా

## కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్‌కు అర్హత
## సెమీస్‌లో భారత్‌కే చెందిన రక్షిత శ్రీపై విజయం

బలగం టీవీ, హైదరాబాద్

కొరియా మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత యంగ్ షట్లర్ అష్మిత చాలిహా అద్భుత ప్రదర్శనతో మెరిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో భారత క్రీడాకారిణి రక్షిత శ్రీ రామ్‌రాజ్‌పై విజయం సాధించి, కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

శనివారం ఆసన్ వై సున్-సిన్ జిమ్నాసియంలో జరిగిన ఈ సెమీస్‌లో 26 ఏండ్ల అష్మిత 21-13, 16-21, 21-13 స్కోరు తేడాతో రక్షితను ఓడించింది. 48 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ఆరంభం నుంచే తీవ్ర ఆధిపత్యం ప్రదర్శించిన అష్మిత విజయాన్ని ఖరారు చేసుకుంది. ఫైనల్ పోరులో చైనాకు చెందిన నాలుగో సీడ్, ప్రపంచ 35వ ర్యాంకర్ హాన్ జియాన్ జి (Han Qianxi)తో అష్మిత తలపడనుంది.

# వర్డ్ అథ్లెటిక్స్ అండర్-20: ఆశిష్ యాదవ్‌కు రజతం
## జావెలిన్ త్రోలో భారత్‌కు తొలి పతకం

బలగం టీవీ, హైదరాబాద్




ప్రపంచ అథ్లెటిక్స్ అండర్-20 చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. పురుషుల జావెలిన్ త్రోలో భారత అథ్లెట్ ఆశిష్ యాదవ్ రజత పతకం సాధించాడు. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్ పోరులో 19 ఏండ్ల ఆశిష్ మూడో ప్రయత్నంలో ఈటెను 74.09 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు.

దీంతో ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా (2016లో 86.48 మీటర్లతో స్వర్ణం) తర్వాత ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జావెలిన్ త్రో విభాగంలో పతకం నెగ్గిన రెండో భారతీయ అథ్లెట్‌గా ఆశిష్ చరిత్రకెక్కాడు.

ఫైనల్లో పూజ, షానవాజ్, జిథిన్:

మరోవైపు మహిళల హైజంప్‌లో భారత అథ్లెట్ పూజ సింగ్ 1.79 మీటర్ల ఎత్తు దాటి ఫైనల్‌కు అర్హత సాధించింది. అలాగే పురుషుల లాంగ్ జంప్ ఈవెంట్‌లో షానవాజ్ ఖాన్, జిథిన్ అర్జున్‌లు అత్యుత్తమ ప్రదర్శనతో ఫైనల్ బెర్తులను ఖాయం చేసుకున్నారు.

# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు






మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది



## సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.




# CINEMA

## రామాయణ తొలుత విదేశాల్లో విడుదల



రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.

## 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ



హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.



# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణెళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్ లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్టిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.

